నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 12 ఏప్రిల్ 2024 | MAHABUBNAGAR NARAYANPET




పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి

# సమాజ మార్పునకు పూలే కృషి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు/మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 11 : సమాజ మార్పునకు కృషి చేసిన మహనీయుల్లో జ్యోతిరావు పూలే అని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం పూలే జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్‌లో పూలే విగ్రహానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా చైర్మన్ వెంకన్న, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కౌన్సిలర్ రవికిషన్‌రెడ్డి, నాయకులు నవకాంత్, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.



జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

# బహుజనుల ఆశాజ్యోతి పూలే

- పూలే జయంతి వేడుకల్లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 11 : బహుజన సామాజిక అభివృద్ధి కోసం పరితపించిన నేత బహుజనుల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావుపూలే అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మాజీ మంత్రి నివాసంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే బడుగు, బలహీన వర్గాలు, మహిళల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించారని, ఆయన ఆశయాలను తెలంగాణ ఏర్పాటుతో మళ్లీ కేసీఆర్ కొనసాగించారని ఉద్ఘాటించారు. పూలే పేరిట గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి బడుగు, బలహీన వర్గాల బిడ్డల ఉన్నత చదువులకు శ్రీకారం చుట్టారన్నారు. విదేశీ విద్యకు కూడా చేయూత కల్పించారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు పరంజ్యోతి, అశోక్, జాత్రునాయక్, నాగన్నయాదవ్, తిరుమల్, నీలస్వామి, శ్రీను, జోహెబ్, గిరి, వెంకటేశ్, శేఖర్, శంకర్‌నాయక్, గులాం, బాబుమియ్య, రహీం, ఆరీఫ్ పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# ఆశయాలను కొనసాగించాలి

- గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఏప్రిల్ 11 : బహుజనుల అభివృద్ధి కోసం, స్త్రీలకు విద్యను అందించేందుకు జ్యోతిరావు పూలే కృషి చేశారని, ఆయన ఆశయ సాధనకు యువత నడుం బిగించాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలే త్యాగం వల్లే మహిళలు విద్యారంగంలో రాణిస్తున్నారని, సమాజంలో మార్పుకోసం ఆయన చేసిన కృషి ఎన్నటికీ మరువలేనిదని గుర్తు చేశారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ సుభాన్, ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ రాజశేఖర్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, మురళి, నరహరిశ్రీనివాసులు, దౌలు, నాయకులు వెంకట్రాములు, రమేశ్‌నాయుడు, జంబురామన్‌గౌడ్, గోవింద్, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

# అడుగుజాడల్లో పయనిద్దాం

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, ఏప్రిల్ 11 : మహాత్మా జ్యోతిరావు పూలే భావి తరాలకు ఆదర్శనీయమని, ఆయన అడుగుజాడల్లో అందరం నడుద్దామని ఎమ్మెల్యే విజయుడు పిలుపునిచ్చారు. గురువారం అలంపూర్ మున్సిపాలిటీలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, వివిధ ప్రజా, కుల సంఘాల నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయుడు



కార్యకర్తలతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

# కలిసికట్టుగా పనిచేయాలి

- బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

బిజినేపల్లి ఏప్రిల్ 11 : రానున్న ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మహదేవునిపేటలో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని, ఎక్కువ మంది ఎంపీలు బీఆర్‌ఎస్ తరపున ఉంటే పార్లమెంట్‌లో మన గళం విప్పి అత్యధిక నిధులు తెలంగాణకు తీసుకురావచ్చన్నారు. పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న తీరును కూడా ప్రజలకు వివరించాలని, అప్పుడే ప్రజలు చైతన్యమై బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, కృష్ణ, నర్సింహారెడ్డి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## నోటిఫికేషన్ వేసినా..

జిల్లాలోని దవాఖానల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేసేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రకటనను విడుదల చేసింది. నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో ఈ ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ గత ఫిబ్రవరిలో ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలు, ఎంపీ ఎలక్షన్ల కోలాహలంతో ఈ ప్రక్రియ ప్రారంభంలోనే నిలిచిపోయింది. ఇలా మరో రెండునెలల వరకు ఈ స్టాఫ్ నర్సుల భర్తీ ప్రక్రియకు బ్రేకులు పడినట్లుగానే భావిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగిసిన తర్వాతే భర్తీ చేసే అవకాశం ఉంటుంది. కాగా మొత్తం 26 పోస్టులకు ప్రకటన జారీ చేయగా, వీటిలో 17 వరకు స్టాఫ్ నర్సుల పోస్టులు ఉన్నాయి.

## వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య

| ఏడాది | ప్రసవాల సంఖ్య |
|---|---|
| ఏప్రిల్ (2023) | 747 |
| మే | 759 |
| జూన్ | 679 |
| జూలై | 768 |
| ఆగస్టు | 791 |
| సెప్టెంబర్ | 819 |
| అక్టోబర్ | 743 |
| నవంబర్ | 761 |
| డిసెంబర్ | 792 |
| జనవరి (2024) | 728 |
| ఫిబ్రవరి | 441 |
| మార్చి | 443 |





మదనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

# కాన్పులు తగ్గుముఖం

- వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో తగ్గిన ప్రసవాలు
- ఫిబ్రవరి, మార్చిలో భారీగా..
- జిల్లావ్యాప్తంగా 20 దవాఖానలు
- 99 మంది స్టాఫ్‌నర్సులకు 19 మందే విధుల్లో..
- ఎన్నికల కోడ్‌తో నిలిచిన భర్తీ ప్రక్రియ

వనపర్తి, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య తగ్గిపోతున్నది. గతంలో 'నేను రాను బిడ్డో.. సర్కారు దవాఖాన'కు అన్న రోజులు మళ్లీ దాపురించే పరిస్థితులు తలెత్తుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో వైద్య రంగానికి పెద్దపీట వేయగా.. నిరంతరం కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలందేవి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వనపర్తి జిల్లాలో మాత్రం కాన్పులు భారీగా తగ్గిపోతున్నాయి. గతంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల్లో చాలా మందికి పర్మినెంట్ ఉద్యోగాలు రావడంతో ఒక్కసారిగా ప్రభుత్వ వైద్యశాలల్లో అధికంగా ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో జిల్లాలోని పలు దవాఖానల్లో కాన్పులను చూసే స్టాఫ్ నర్సులు లేకపోవడంతో ప్రసవాల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది.

*జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో 99 మంది స్టాఫ్ నర్సులకుగానూ కేవలం 19 మంది మాత్రమే పని చేస్తున్నారు. దీంతో ఎందరో దవాఖానల్లో స్టాఫ్ నర్సులు లేక ప్రసవాల సేవలు నిలిచిపోయాయి. జిల్లాలో 13 ప్రాథమిక దవాఖానలు ఉంటే.. రెండు బస్తీ దవాఖానలు, మరో రెండు యూపీహెచ్‌సీ(అర్బన్ హెల్త్ సెంటర్)లు ఉన్నాయి. మొత్తం 17 దవాఖానలు ఉండగా.. వీటికి అదనంగా మరో 3 సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) పని చేస్తున్నాయి. అయితే, పీహెచ్‌సీలన్నీ 24 గంటలపాటు వైద్య సేవలందించేవిగా ఉన్నాయి. వీటిలో ప్రధానంగా స్టాఫ్‌నర్సులు నలుగురుంటేనే ప్రసవాల సేవలందించేందుకు వీలవుతుంది. ఇలా నలుగురు స్థానంలో ప్రస్తుతం జిల్లాలోని అన్ని దవాఖాల్లో ఒక్కొక్కరే స్టాఫ్ నర్సులు విధుల్లో ఉన్నారు. ఇతర వైద్య సహాయం సంగతి అటుంచితే... ముఖ్యంగా ప్రసవాలకు మాత్రం ప్రభుత్వ దవాఖానల్లో సేవలు మందగించినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఒక్కో స్టాఫ్ నర్సులున్న చోట ప్రసవ సేవలందడం గగనమైంది.*

**ప్రతినెలా 800 వరకు..**

గతేడాది కేసీఆర్ ప్రభుత్వంలో కాన్పుల సంఖ్య బాగా ఉండేది. 2023 మార్చి నుంచి 2024 జనవరి వరకు సర్కారు దవాఖానల్లో కాన్పుల వివరాలను పరిశీలిస్తే.. ప్రతి నెలా 750 నుంచి 850 వరకు ప్రసవాలు జరిగాయని రికార్డులు చెబుతున్నాయి. కానీ నేడు గణనీయంగా కాన్పులు తగ్గాయి. ఈ లెక్కల ప్రకారం చూస్తే.. సగానికి కొంత అటు.. ఇటుగా సంఖ్య పడిపోయినట్లుగా అర్థమవుతున్నది. కేసీఆర్ ప్రభుత్వంలో దవాఖానలను ప్రక్షాళన చేసి వైద్య సేవలు గణనీయంగా పెంచడంతో ప్రజలంతా దవాఖానల బాటపట్టారు. ఏ దవాఖాన చూసినా సేవలకు ఇబ్బంది రానివ్వకుండా చర్యలు తీసుకుంటుండడంతో ప్రజలకు విరివిగా సర్కారు వైద్యం అందుబాటులోకి వచ్చింది. గతంలో ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి రూ.వేలు ఖర్చు చేసి కాన్పులు చేయించుకునే పరిస్థితి ఉండేది.. నాటి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో సర్కారు వైద్యశాలల్లోనే కాన్పులు జరుగుతున్న విషయం తెలిసిందే.

**ఫిబ్రవరి, మార్చిలో తగ్గుదల**

వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య రెండు నెలలుగా తగ్గుముఖం పట్టింది. ఫిబ్రవరి, మార్చిలో సంఖ్య మరింత తగ్గింది. కారణాలేమైనా సర్కారు దవాఖానల్లో డెలివరీలు సగానికిపైగా తగ్గడం కనిపిస్తున్నది. కాగా జనవరి నుంచి దవాఖానల్లో ఒక్కొక్క స్టాఫ్‌నర్సు మాత్రమే విధుల్లో ఉండడం కూడా మరో కారణంగా చెప్పొచ్చు.

## స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేస్తాం



వనపర్తి జిల్లాలోని అన్ని దవాఖానల్లో స్టాఫ్ నర్సుల సంఖ్య తగ్గిపోయింది. దాదాపు అన్ని చోట్ల కూడా ఒక్కొక్కరే ఉన్నారు. గతంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే సిబ్బంది పర్మినెంట్ ఉద్యోగాలకు వెళ్లారు. దీంతో ఖాళీల సంఖ్య ఏర్పడింది. భర్తీ కోసం ఫిబ్రవరిలోనే ప్రకటన జారీ చేశాం. ఎన్నికల కోడ్ రావడంతోనే భర్తీ ప్రక్రియ నిలిచింది. కోడ్ ముగిసిన వెంటనే భర్తీ చేస్తాం. అంత వరకు ఉన్న సిబ్బందితోనే పనులకు ఆటంకం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. ప్రధానంగా స్టాఫ్‌నర్సుల కొరత ఉన్నందునే ఫిబ్రవరి, మార్చిలో ప్రభుత్వ దవాఖానల్లో కాన్పుల సంఖ్య తక్కువగా నమోదైంది.

- జయ చంద్రమోహన్, జిల్లా వైద్యాధికారి, వనపర్తి



మహబూబ్‌నగర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# ఈద్ ముబారక్

- ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు
- పండుగ విశిష్టతను తెలిపిన మతపెద్దలు

క్రమశిక్షణ, ధార్మికత, ధార్మిక చింతనల మేలు కలయిక అయిన ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పర్వదినాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు రంజాన్ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి, సుగంధ ద్రవ్యాలు పూసుకొని కళ్లకు సురుమా, తలకు టోపీ పెట్టుకొని పిల్లలు, పెద్దలు, వృద్ధులు నమాజ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవక్తలు ఇస్లాం సందేశాన్ని వినిపించి మహ్మద్ ప్రవక్త చూపిన మార్గాన్ని, సత్యమార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. అనంతరం ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, అధికారులు ముస్లింలకు ఈద్ ముబారక్ తెలిపారు. ప్రార్థనా స్థలాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్





గద్వాలలో పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మహబూబ్‌నగర్‌లో ఈద్‌ముబారక్ తెలుపుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె

# ట్రాక్టర్ బోల్తా..

- 18మంది కూలీలకు గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

ఉప్పునుంతల, ఏప్రిల్ 11 : మండలంలోని కంసానిపల్లిలో గురువారం ఉపాధి హామీ పనుల కోసం కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 18మందికి గాయాలు కాగా, అందులో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. కంసానిపల్లికి చెందిన 18 మంది ఉపాధి కూలీలు చీకటివాగు వద్ద పనులు ముగించుకొని ట్రాక్టర్‌పై ఇంటికి వస్తుండగా కట్టపైన అదుపుతప్పి బోల్తా పడింది. అందులో చంద్రయ్య, శంకరయ్య, కృష్ణవేణి, లక్ష్మమ్మకు కాళ్లు, చేతులు విరిగాయి. మిగతా 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో అచ్చంపేట దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ గాయపడిన వారిని పరామర్శించి స్వయంగా వైద్య చికిత్సలు అందించారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా పరామర్శించారు. ఈ ఘటనపై ఉపాధి కూలీ పద్మ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.



నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

## ఓటర్ల తొలగింపుపై ఫిర్యాదు

- బతికుండగానే 115 మంది ఓట్లు గల్లంతు

కోడేరు, ఏప్రిల్ 11 : మండలంలోని ముత్తిరెడ్డిపల్లిలో బతికున్న 115 మంది ఓటర్ల తొలగింపుపై గ్రామానికి చెందిన అంజన్‌గౌడ్, భాస్కర్ గురువారం అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్‌కు ఫిర్యాదు చేశారు. ముత్తిరెడ్డిపల్లికి చెందిన ఓటర్లను ఏ కారణం చేత ఎవరు తొలగించారో విచారణ చేసి అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులు ఉంటే గ్రామ పంచాయతీ కార్యాలయం నోటీసు బోర్డుపై అతికించి లేదా దండోరా వేయించాల్సి ఉండగా ఎలాంటి కారణం చూపకుండా బతికున్న వారి పేర్లను తీసేశారని ఆరోపించారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ కోడేరు తాసీల్దార్ కార్యాలయానికి చేరుకొని అధికారులతో విచారణ నిర్వహించారు. అయితే ఓటర్ల జాబితాలో డబుల్ పేర్లు ఉంటేనే తొలగిస్తారని, బతికున్న వారి పేర్లను ఎలా తీసేస్తారనే విషయంపై విచారణ నిర్వహిస్తున్నామని, అర్హులుంటే పేర్లను తిరిగి నమోదు చేస్తామని అదనపు కలెక్టర్ వెల్లడించారు.